క్లుప్తంగా

'అమ్మ ఒడి'కి అనాథ మహిళ



మతిస్థిమితం లేని మహిళను చేరదీసి సపర్యలు చేస్తున్న అమ్మ ఒడి సభ్యులు

మదనపల్లె : పట్టణంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న అనాథ మహిళను, గురువారం చిత్తూరుకు చెందిన అమ్మ ఒడి అనాథాశ్రమం సభ్యులు చేరదీశారు. మహిళకు అన్ని సపర్యలు చేసి చిత్తూరులోని అమ్మ ఒడి అనాథ ఆశ్రమానికి తరలించారు. కార్యక్రమంలో అమ్మ ఒడి ఫౌండర్ పద్మనాభనాయుడు, రేణుక, ఉషారాణి, లావణ్య, పూర్ణిమ, టిస్లా ప్రకాష్, హుస్సేన్, ఉదయ్‌కుమార్, సరీనా, శోభ, ముబారక్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు మాజీ ఎమ్మెల్యే ఆశీర్వాదం



గుర్రంకొండ: వధూవరులతో మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి (వాల్మీకిపురం) : పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం పలు వివాహ కార్యక్రమాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కలకడ మండలం కదిరాయచెరువుకు చెందిన శ్రీనివాసులు యాదవ్ కుమారుడు ఆనంద్ యాదవ్ వివాహ కార్యక్రమానికి హాజరైవధూవరులను ఆశీర్వదించారు. వాల్మీకిపురం పట్టణం ఎన్‌టిఆర్ కాలనికి చెందిన మాడికిరి సుబ్బరాజు నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై అభినందనలు తెలియచేశారు. మదనపల్లి పట్టణం ఎస్‌బీఐ కాలనికి చెందిన చంద్రశేఖర్ కుమార్తె అఖిల వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వాల్మీకిపురం నగిరిమడుగు గ్రామం చిన్ననారాయణరెడ్డిగారిపల్లికి చెందిన రమేష్‌కుమార్‌రెడ్డి కుమార్తె భావన వివాహం అంగళ్లు కేఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరగ్గా.. చింతల హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

గుర్రంకొండ: గోల్డెన్ ప్లాజా కల్యాణమండపంలో కలకడ మండలం కదిరాయచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీనాయకులు చెనిక్కాయల శ్రీనివాసులు యాదవ్ కుమారుడు ఆనంద్ యాదవ్ వివాహ మహోత్సంలో చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన నిసార్‌అహ్మద్

మదనపల్లె : మండలంలోని మేడిపల్లె వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు రఘుపతి కుమారుడి వివాహ వేడుకలకు గురువారం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ నాయకులతో కలిసి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు జన్నే రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

రామసముద్రం : రామసముద్రం మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో గురువారం పదోతరగతి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువులో బాగా రాణించాలని సూచించారు. మంచి క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేర నియంత్రణపై అవగాహన

ఒంటిమిట్ట: సమాజ భద్రతలో పోలీసుల పాత్ర, నేర నియంత్రణ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు కల్పించేందుకు ఒంటిమిట్ట ఒంటిమిట్ట ఏఎస్ఐ ఆనందరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీసాయి భారతి హైస్కూల్ విద్యార్థులకు స్టేషన్‌లో కేసుల నమోదు, దర్యాప్తు విధానం, నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సాంకేతికత వాడుక, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ గురించి విద్యార్థులకు సిబ్బంది వివరించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ క్రమశిక్షణ, చట్ట పాలన, భద్రతపై అవగాహన కల్పించేందుకు ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కెఆర్ఎం .ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల సభ్యులు, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

రంగంపల్లిలో గ్రామ సభ

పుల్లంపేట: మండలంలోని రంగంపల్లి సచివాలయం వద్ద గురువారం గ్రామసభ నిర్వహించారు. ఏపీఓ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై షల్ ఆడిట్ నిర్వహించారు. ఈ నెల 13న ఎంపీడీఓ కార్యాలయం నందు ఓపెన్ ఫోరమ్ ఉంటుందని అధికారులు తెలిపారు.

సారూ.. గుక్కెడు మంచినీళ్లివ్వరూ!

- గుర్రంకొండ మార్కెట్ యార్డుకొచ్చే రైతుల వేడుకోలు
- రూ.20లక్షల వాటర్ ప్లాంట్ నిరుపయోగం
- శుభ్రతకు నోచుకోని వాటర్ ట్యాంక్



గుర్రంకొండలోని మార్కెట్‌యార్డు



నిరుపయోగంగా మారిన వాటర్‌ప్లాంట్

గుర్రంకొండ : గుర్రంకొండ మార్కెట్‌యార్డులో గుక్కెడు తాగునీరు కరువైంది. దేవుడు వరమిచ్చినా.. పూజారి వరమియ్యని చందంగా మారింది ఇక్కడి పరిస్థితి. ఒకటి రెండు కాదు 20 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంటు నిరుపయోగంగా ఉంది. యార్డులో తాగునీటి బోరు ఉన్నా.. లక్షలు ఖర్చు చేసి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినా రైతన్నల గొంతు తడవని దుస్థితి నెలకొంది. దూరాభారం నుంచి మార్కెట్ యార్డ్‌కు వచ్చే రైతులు గుక్కెడు నీళ్లు దొరక్క దాహానికి అలమటిస్తున్నారు. ఇప్పటికే సూరీడు వేడెక్కాడు. ఉదయం 11 దాటిందంటే చాలు ఎండలకు నోరెండిపోతోంది. యార్డులో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను శుభ్రం చేసేవారు లేక పోవడంతోనే నిరుపయోగంగా మారింది. దీంతో రైతులు మంచినీరు కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది.

రూ.20లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో రూ.4 కోట్లతో స్థానిక మార్కెట్‌యార్డు నిర్మాణం జరిగింది. ఇందులో తాగునీటి కోసమే రూ.20లక్షలు కేటాయించారు. ఇందులో భాగంగా మార్కెట్‌యార్డులోని ఓ గదిలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. బోరు వేసి వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసి దానికి పైపులైను కూడా అమర్చారు. వాటర్ ట్యాంకుకు నీటి సరఫరా చేసి తద్వారా వాటర్‌ప్లాంట్‌లోకి నీరు వచ్చేలా ఏర్పాటు చేశారు. యార్డుకొచ్చే రైతులు కొళాయిల్లో వచ్చే శుద్ధి నీటిని వినియోగించుకునే వారు.

తుప్పుపట్టిన వాటర్ ప్లాంట్ యంత్రాలు

లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారి మూలన పడింది. దీంతో అందులోని పరికరాలు, యంత్రాలు తుప్పుపట్టిపోతున్నాయి. గది ముందు ఏర్పాటు చేసిన నీటి కొళాయిలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడంతో విరిగిపోయాయి. ప్రస్తుతం గది ముందు కొళాయిలు లేని తాగునీటి పైపు మాత్రమే మిగిలింది. యార్డులోని బోరు నుంచి ఎగువ వైపు ఉన్న వాటర్ ట్యాంక్‌కు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. చాలారోజులుగా వాటర్ ట్యాంకు శుభ్రం చేయలేదు. దీంతో వాటర్‌ట్యాంక్ చెత్తా చెదారంతో నిండిపోయింది. ఇదే అదునుగా మార్కెట్‌యార్డులో మంచినీళ్ల వ్యాపారులు ఏంచక్కా జేబులు నింపుకుంటున్నారు. ఒక్కో వాటర్ బాటిల్‌ను కొందరు రూ. 20కి అమ్మితే మరికొందరు రూ.25 వరకు రాబడుతున్నారు. దీంతో మార్కెట్‌యార్డులోని కూల్‌డ్రింక్స్, ఇతర వ్యాపార దుకాణాల్లో మంచినీళ్ల వ్యాపారం కాసుల వర్షం కురిపిస్తోంది. దీంతో మార్కెట్‌యార్డు అధికారులు యార్డులోనే మరిన్ని ప్రైవేట్ దుకాణాల నిర్వహణకు అనుమతి ఇవ్వడం గమనార్హం.

సమస్యను పరిష్కరించండి

మార్కెట్‌యార్డులో గుక్కెడు మంచినీరు దొరక్క రైతులు కష్టాలు పడుతుంటే.. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. స్థానిక మార్కెట్‌యార్డుకు గుర్రంకొండ, చిన్నమండ్యం, కలకడ, పెద్ద మండ్యం, గాలివీడు, తంబళ్లపల్లె మండలాలకు చెందిన రైతులు వేలాది మంది ప్రతినిత్యం వస్తుంటారు ఇప్పటికైనా అధికారులు తాగునీటి సమస్యపై దృష్టిసారించి తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తగినంత బడ్జెట్ లేదు



మార్కెట్‌యార్డులో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలంటే ఖర్చుతో కూడుకున్న పని. ప్రస్తుతం తమ దగ్గర అంత బడ్జెట్ లేదు. వాటర్ ప్లాంట్‌లో ఉన్న యంత్రాలన్ని తుప్పుపట్టిపోయాయి. గతంలో మెకానిక్‌ను పిలిపించి మరమ్మతు చేయించాం. ప్రస్తుతం తుప్పుపట్టిన యంత్రాలన్ని శిథిలావస్థకు చేరుకొన్నాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తేగానీ వాటర్ ప్లాంట్ వినియోగంలోకి రాదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

-కుమార్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

చలివేంద్రం ప్రారంభం

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రంలో ఆటోయూనియన్ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ నరసింహుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజసేవ చేయడం ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని అన్నారు. ఆటో యూనియన్ సభ్యులు బాధ్యతాయుతంగా మెలగడం అభినందనీయమన్నారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీలేరు మండల పార్టీ అధ్యక్షుల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పీలేరు మండల పార్టీ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. కంభంవారిపల్లె మండల అధ్యక్షుడిగా ఎం. వెంకట రమణారెడ్డి, కలికిరి అధ్యక్షుడిగా చింతల రమేష్‌రెడ్డి, కలకడ అధ్యక్షుడిగా ఏ. కమలాకర్ రెడ్డి, గుర్రంకొండ అధ్యక్షుడిగా డి. ముక్తియార్ అలీఖాన్, వాల్మీకిపురం అధ్యక్షుడిగా పి. శివకుమార్ రెడ్డి, పీలేరు మండల అధ్యక్షుడిగా డి. జగన్‌మోహన్‌రెడ్డిలను నియమించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కేవీపల్లె : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

మహిళల భద్రతకు పటిష్ట చర్యలు

సీఐ జీవన్ గంగనాథ్ బాబు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

బి.కొత్తకోట : మహిళలు, బాలికల భద్రత విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యానికి తావుండదని స్థానిక సీఐ జీవన్ గంగనాథ్‌బాబు అన్నారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో మహిళా సంఘాలకు చెందిన మహిళలు, సంఘమిత్రలు, కేజీబీవీ బాలికలతో సీఐ వేర్వేరుగా ఓపెన్ హౌస్ సమావేశాలు నిర్వహించారు. బాలికలు, మహిళల భద్రతకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎలాంటి పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలి, గుర్తు తెలియని వ్యక్తులు, మోసపూరిత మాటలతో మభ్యపెట్టే వ్యక్తుల వ్యవహారశైలి ఎలా ఉంటుంది, దానికి తగ్గట్టుగా ఎలా ప్రతిచర్య ఉండాలి అన్నదానిపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు 122, 181,10920, 1291 నంబర్లకు సమాచారం ఇస్తే నిమిషాల వ్యవధిలో పోలీసులు అందుబాటులోకి వచ్చి ఆపద నుంచి రక్షిస్తారని పేర్కొన్నారు.

క్వారీ నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయసేకరణలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : మండలంలోని కొత్తపల్లె పంచాయతీ ఉడుంవారిపల్లె సమీపంలో సర్వే నంబర్.350లో ఏర్పాటు చేయనున్న కలర్ గ్రానైట్ క్వారీ నిర్వహణకు సంబంధించి గురువారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, కడప రీజనల్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, పీసీబీ ఈఈ సుధ, తహసీల్దార్ ధనంజయులు సమక్షంలో ప్రజల అభిప్రాయాలను నమోదుచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ..క్వారీల నుంచి వచ్చే పేలుళ్లతో పెద్ద బండరాళ్లు పొలాల్లో పడుతున్నాయని, బోర్లు పూడుతున్నాయన్నారు. గ్రామాల్లో విపరీతమైన దుమ్ము, ధూళితో పాటు శబ్ద కాలుష్యం ఉంటోందన్నారు. తమ గ్రామాల చుట్టూ దాదాపు 15 వరకు క్వారీలు ఉన్నాయని, ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా క్వారీ యజమానులు..ప్రభుత్వ నిబంధనల ప్రకారమే క్వారీలు నడుపుతామని, చెట్లు నాటుతామని, గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు తమవంతు సహకారం అందిస్తామని చెబుతారని, తర్వాత అనుమతులు వచ్చాక, వాటి గురించి పట్టించుకోవడం మానేస్తారన్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లె వైస్ సర్పంచ్ నందకుమార్, ఉడుంవారిపల్లె నాయకులు నారాయణస్వామి మాట్లాడుతూ... క్వారీల నుంచి ప్రభుత్వం వసూలు చేసే డీఎంఎఫ్(డిస్ట్రిక్ట్ మైనింగ్ ఫండ్) నిధులను పంచాయతీలకు మంజూరుచేస్తే, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు వీలుంటుందన్నారు. క్వారీ యజమానులు గ్రామస్థులకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేదిశగా చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా క్వారీ యజమానులు, సర్వేనెం.350లో 6 హెక్టార్లు తాము కలర్ గ్రానైట్ మైన్ తవ్వకాలకు దరఖాస్తు చేసుకున్నామని, ఏడాదికి 10.739.52 మెట్రిక్ టన్ను తవ్వకాలు జరుపుతామని ప్రభుత్వానికి నివేదించామన్నారు. పర్యావరణానికి ఎలాంటి హానిలేకుండా, శబ్ద కాలుష్యం చేయకుండా మైనింగ్ నిర్వహిస్తామన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ.. స్థానికుల అభ్యంతరాలను తాము ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతామని చెప్పి ప్రజాభిప్రాయ సేకరణను ముగించారు. కార్యక్రమంలో తాలూకా సీఐ కళావెంకటరమణ, వీఆర్వో చంద్రయ్య, పర్యావరణవేత్త జీఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ

మదనపల్లె : గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ప్రయాణికులను గమ్య స్థలానికి చేరవేస్తూ, ప్రభుత్వానికి కోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తున్న ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ అన్నమయ్య జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం రెడ్డప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు భారీగా చలానాలు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 21, 31 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీజిల్, పెట్రోల్ ధరలతో పాటు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ 30 శాతానికి తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటోల మీద ఉన్న పోలీస్ ఈ– చలానులు రద్దు చేయాలని కోరారు. గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో ఆటో స్టాండ్లు, పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 894 గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీం బాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వేణు గోపాల్ రెడ్డి ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ముబారక్, అధ్యక్షుడు రెడ్డప్ప, మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు నాగేశ్వరరావు, వెంకటేష్,రమణ, మస్తాన్,శివ శంకర,గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులను వినియోగించుకోవాలి

డీఎల్‌పీఓ నాగరాజు



వానపాముల ఎరువును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

తంబళ్లపల్లె: మండలంలో ప్రతి గ్రామపంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం కుక్కరాజుపల్లె, కోటకొండ, కన్నెమడుగు, తంబళ్లపల్లెలోని డంపింగ్‌యార్డులను పరిశీలించారు. వానపాముల ఎరువు తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు అనిత, ప్రమీల, సునీల, రామకృష్ణ ఉన్నారు.

ఇన్‌స్పైర్ మనాక్‌కు ఎంపిక

పెనగలూరు: మండలంలోని చక్రంపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బి.సుమియా ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనాక్‌లో ప్రతిభ చూపడంతో సుమికాకు కేంద్ర ప్రభుత్వం రూ.10000 బహుమతి అందిస్తుందన్నారు. ఎంఈఓ గిరి వరదయ్య, హరిప్రసాద్, అన్వర్‌బాషా, శ్రీవాణి, ఉపాధ్యాయులు విద్యార్థినికి మెమెంటో అందజేసి అభినందించారు.

ప్రభుత్వ కళాశాలల్లో చదివించండి

ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిల్లలను చేర్పించాలని ప్రిన్సిపల్ డీఆర్.హరిత తల్లిదండ్రులను కోరారు. తల్లెంవారిపల్లి, చిన్న ఓరంపాడు, ఓబులవారిపల్లి జెడ్పీ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు గురువారం ఆమె ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి అత్యున్నత స్థాయిలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటిలో జాబ్‌మేళా

రాయచోటి జగదాంబసెంటర్: రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 7న యంగ్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలతా పంకజ్ తెలిపారు. రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, రెస్యూమ్‌లతో శుక్రవారం ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణానికి హాజరు కావాలన్నారు.

సర్పంచ్ చలపతికి మాతృవియోగం



చెన్నమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తదితరులు

మదనపల్లె : మండలంలోని కురవంక పంచాయతీ సర్పంచ్ పసుపులేటి చలపతి తల్లి పి.చెన్నమ్మ(90) గురువారం ఉదయం మృతిచెందారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి తదితరులు చలపతి స్వగృహానికి వెళ్లి చెన్నమ్మ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చలపతిని పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు నరిబాబాయ్, సాయిశేఖర్‌రెడ్డి, మునిశేఖర్, కొత్తపల్లి మహేష్, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ పంచాయతీ రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బాచిరెడ్డి చెంగల్‌రెడ్డి మృతి పట్ల పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం ప్రకటించారు. చెంగల్‌రెడ్డి గత కొంతకాలం అనారోగ్యం బాధపడుతూ గత బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారికుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఇసుక అక్రమ రవాణా



దేగనవాండ్లపల్లెలో పెన్నానది నుంచి ఇసుక రవాణా

సిద్దవటం: మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరందకుంది. నాయకుల అండతో కొందరు నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని టక్కోలు, దేగనవాండ్లపల్లె, మాచుపల్లె, లింగంపల్లె, సిద్దవటం పెన్నానది పరివాహక గ్రామాల నుంచి నిత్యం ఇసుక రవాణా అవుతోంది. కొందరు అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా కడప నగరానికి రవాణా చేస్తూ వేల రూపాయలు సంపాదిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఇసుక రవాణాతో తమ బోర్లలో భూగర్భజలాలు అడుగంటి పంట నష్టపోయే ప్రమాదం ఉందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెన్నానదిలో ఇసుక రవాణా చేసే వారు అధికలోతుకు గొయ్యి తీయడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత వివరణ కోరగా అక్రమ ఇసుక రవాణా జరిగే పెన్నానది ప్రాంతాల్లోకి వాహనాలు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా జేసీబీ యంత్రాలతో గోతులు తీసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

ఫ్రూట్ కవర్లలో మామిడికి భలే గిరాకీ



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రబాబు



కాయలకు ఏర్పాటుచేసిన ఫ్రూట్ కవర్లు

సుండుపల్లె: మామిడి రైతులు జాగ్రత్తలు పాటించి ఫ్రూట్ కవర్లు తొడిగిన మామిడి కాయలకు మంచి గిరాకీ ఉంటుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రవీంద్రబాబు అన్నారు. మండలంలోని తిమ్మసముద్రం, మడితాడు గ్రామాల మామిడి రైతులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మామిడి పండ్లకు కవర్లు తొడగడంతో నల్ల తామర పురుగులు, పండు ఈగ, తేనెమంచు పురుగు, మసి తెగులు, బంక తెగుళ్ల నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. కవర్లు తొడిగిన మామిడి కాయలు నాణ్యత, కలర్, రంగు రుచి, వాసన కలిగి ఉంటాయన్నారు. ఈ పండ్లకు తొడిగే కవర్లను ఉద్యాన శాఖ 50 శాతం రాయితీతో ఎకరాకు 4 వేల కవర్లను అందిస్తోందన్నారు. ఒక్కొక్క కవరు ఖరీదు రూ.2.20పై కాగా, రైతు వాటా రూ.1.20పై. తీసుకుంటారన్నారు. రైతులు భూమి పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్, అకౌంట్ జిరాక్స్, చిన్న పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకుని దగ్గరలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖఅధికారి వనిత, ప్రకృతి వ్యవసాయ నిపుణులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

కవర్ల వాడకంలాభదాయకం

సిద్దవటం: మామిడి తోటల్లో కాయలకు ఫ్రూట్ కవర్ల వాడకం ఎంతో లాభదాయమని ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. సిద్దవటంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫ్రూట్ కవర్లు వాడడంతో తామర, తేనెమంచు పురుగులు, పండు ఈగ నుంచి రక్షణ కలుగుతుందని, అధిక వేడిమి, వడిగండ్ల వాన నుంచి కాపాడుకోవచ్చునని తెలిపారు. కాయలు నిమ్మకాయ, కోడిగుడ్డు సైజులో ఉన్నప్పుడు గాలి చొరబడకుండా తొడిమ వరకూ కవరు కట్టుకోవాలన్నారు. 50 శాతం రాయితీతో గరిష్ఠంగా 1 హెక్టారుకు 10వేల కవర్లు అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

రైతులకు చేయూత

పుల్లంపేట: మండలంలోని మామిడి రైతులకు రాయితీపై ఫ్రూట్ కవర్లు అందజేసి చేయూత ఇస్తున్నట్లు వ్యవసాయాధికారిణి గాయత్రి తెలిపారు. రూ. 2.20 విలువజేసే ఒక్కో ఫ్రూట్ కవర్ రాయితీపై రూ.1.20కు ఇస్తారన్నారు. మామిడి కాయల నాణ్యతను పెంచుకోవడంతోపాటు తెగుళ్లను నివారించవచ్చున్నారు.

పశువులకు టీకా వేయించాలి

సిద్ధవటం: పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సిద్ధవటం పశు సంవర్ధక శాఖ ఏడీఏ లక్ష్మీదేవి తెలిపారు. సిద్ధవటం పశువుల ఆసుపత్రిలో గురువారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఏడీఏ లక్ష్మీదేవి మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకితే పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి తీగమాదిరి చొంగ కారడం, నోరు, కాలి గిట్టల మధ్య పుండ్లు, ఎండకు రొప్పడం, చూడి పశువులు ఈసకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. పశువుల్లో పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందన్నారు.

ఎల్లమ్మ తిరునాలకు ఏర్పాట్లు

సుండుపల్లె: మండలంలోని యల్లారెడ్డిగారిపల్లె, చెన్నంశెట్టిపల్లెల్లో వెలసిన ఎల్లమ్మ తల్లి తిరునాల శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని, లిందుకోసం ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
పీలేరు మెయిన్ బ్రాంచ్, పీలేరు

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ దిగువ కనబరచిన వ్యక్తులు మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణము గడువు మీరిన తర్వాత కూడ పలు నోటీసులు పంపినా అప్పుచెల్లించి యుండలేదు. సదరు అప్పు వసూలు కోసము బ్యాంకు నిబంధనల మేరకు **18.03.2025 వ తేది మంగళవారం సాయంత్రం** 4 గంటలకు బ్యాంకు ఆవరణలో బహిరంగంగా వేలము ద్వారా సదరు నగలు విక్రయించి అప్పు జమ చేయబడును. **షరతులు:** 1.ఇదివరకు నోటీసు చేరనివారు ఇదే ఆఖరు నోటీసుగా భావించవలెను. 2.ఈ ప్రకటన ఖర్చు అప్పుదారు భరించవలెను. 3.వేలములో పాల్గొనదలచినవారు రూ.10,000/-ధరావతు చెల్లించి పాల్గొనవలెను. 4. వేలము పొందినవారు మిగిలిన సొమ్ము వెంటనే చెల్లించి నగలు స్వాధీనం చేసుకోవలెను. లేనిచో ధరావతు సొమ్ము కోల్పోవుదురు. 5. ఎటువంటి కారణములు తెలుపకనే వేలము వాయిదా వేయుటకు, రద్దుపరచుటకు బ్యాంకువారికి అధికారము కలదు.

వ. నెం.	లోన్ అకౌంట్ నెంబరు	లోన్ తీసుకున్న తేది	అప్పుదారుని పేరు మరియు చిరునామా	లోన్ తీసుకున్న ఋణం రూ.లలో	06.03.2025 నాటికి బాకీ రూ.లలో	నగలు బరువు గ్రాములలో
1.	40886592542	16.06.2022	తుమ్మారి రమణ తండ్రి టి.సిద్దప్ప, 7-85,బలిజ వీధి, పీలేరు–517214	57,000	74,788	18 గ్రాములు

సం/- బ్రాంచి మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పీలేరు మెయిన్ బ్రాంచి, పీలేరు.